ప్రజాశక్తి
మంగళవారం 24 డిసెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

డిఎస్‌సి శిక్షణను పరిశీలించిన కలెక్టర్

పార్వతీపురం : స్థానిక గిరిజన భవన్‌లో నిర్వహిస్తున్న ఉచిత డిఎస్‌సి కోచింగ్ కేంద్రాన్ని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సోమవారం సందర్శించారు. కోచింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. అభ్యర్థులతో ముఖాముఖి మాట్లాడుతూ బోధన, ఆహార సదుపాయాలు, ఇతర అంశాలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసక్తితో, సంకల్పంతో కృషి చేసేలా కృషి చేసి విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ తాము ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారో దానిపట్ల మరింత ఏకాగ్రతతో చదువుతూ పట్టు పెంచుకోవాలని సూచించారు. కోచింగ్ తీసుకున్న ప్రతి అభ్యర్థి టాపర్లుగా నిలిచేలా కృషి చేయాలని సూచించారు. లక్ష్యసాధన దిశగా ప్రతి ఒక్కరూ ప్రతి క్షణం సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో డిజి. ఎస్.తిరుపతినాయుడు, ఐటిడిఎ ఏపిఒ ఎ.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అణచివేతను ఆపండి

జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడండి
కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల సమన్వయ కమిటీ ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలని ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. రైతు సంఘాల సమన్వయ కమిటీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా చేరుకొని, అక్కడ బిజెపికి అనుకూలంగా మలుచుకున్న రాజ్యాంగ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు మాట్లాడుతూ రైతు నాయకులు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడేలా కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించాలని, ఢిల్లీకి పాదయాత్ర చేస్తున్న రైతులపై అణచివేత, బాష్పవాయువు ప్రయోగాలు ఆపాలని, అనుమతులు ఇవ్వాలని, గౌతంబుద్ధ నగర్లోని లక్సర్ జైలులో ఉన్న రైతులందర్నీ విడుదల చేయాలని, తప్పుడు అభియోగాలను ఉపసంహరించుకోవాలని, అన్ని రైతు సంస్థలతో 2021 డిసెంబర్ 9న జరిపిన చర్చల్లో పొందుపర్చిన అంగీకార పత్రంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులపై హత్యాయత్నం, కుట్రకేసుకు బాధ్యులైన పోలీసు కమిషనర్ లక్ష్మీసింగ్, ఇతరులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, పోరాటాలపై అన్ని రైతు సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని, ఎల్ఎఆర్ఆర్ చట్టం 2013 అమలుపై రైతుల నిజమైన దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లను ఆమోదించాలని కోరారు. కొత్త జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం అనేది మూడు వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేసేందుకు కార్పొరేట్ ఎజెండా యొక్క వ్యూహంలో భాగమని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ బంటు దాసు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, గేదెల సత్యనారాయణ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బి.నర్సింగరావు, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమణి, ఐర్ల జిల్లా కార్యదర్శి పి.సంగం, అరుణోదయం సంఘం రాష్ట్ర నాయకులు జయలక్ష్మి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, కౌలు రైతుల సంఘం నాయకులు ఆర్.రమణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి ఈశ్వరరావు, మర్రి శ్రీను, ప్రజానాట్యమండలి నాయకులు కోరాడ ఈశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.రమణారావు, వై.మన్మథరావు, గిరిజన సంఘం నాయకులు ఎం.రమణ, కె.భాస్కరరావు, ఔట్ సోర్సింగ్ యూనియన్ జిల్లా నాయకులు బివి రమణ, ఎఐటియుసి నాయకులు జీవ తదితరులు పాల్గొన్నారు.



బిజెపి అనుకూల ప్రతులను దగ్ధం చేస్తున్న రైతు సంఘాల సమన్వయ కమిటీ నాయకులు

పిజిఆర్ఎస్‌కు 149 వినతులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన సమస్యలు మంచి వాతావరణంలో పరిష్కారం కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు హితవు పలికారు. సమస్యలపై వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఇందులో వివిధ ప్రాంతాలకు చెందిన 149 మంది అర్జీదారులు తమ వినతులను కలెక్టర్ కు అందించి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో దీన్ని ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ జరుగుతున్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని సూచించారు. పరిష్కారమైన సమస్యలతో అర్జీదారులు సంతృప్తి చెందాలని, ఎట్టి పరిస్థితిల్లో అర్జీలు పునఃప్రారంభం కారాదని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వినతుల స్వీకరణలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తావ, కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్ ప్రారంభం

స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కోసం ప్రత్యేకంగా రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభించినట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పిజిఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిధిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్లో కొత్తగా పిజిఆర్ఎస్ రిసెప్షన్ సెంటర్‌ను ప్రారంభించినట్టు తెలిపారు. ఇక్కడ అర్జీలను ఇవ్వడానికి వచ్చే ప్రజలకు తాగునీరు, టీ ఇచ్చే ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఈ విషయమై జిల్లా, మండల అధికారులకు వాట్సప్, టెలి కాన్ఫరెన్స్ ద్వారా తగిన ఆదేశాలు, మార్గదర్శకాలు, సూచనలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ వివరించారు. ముఖ్యంగా మండల కేంద్రాల్లో జరుగుతున్న పిజిఆర్ఎస్ తీరుతెన్నులు, అధికారుల హాజరు, సమయపాలన పాటించడంతో పాటు కార్యక్రమానికి ఎమ్మెల్యేలు హాజరయ్యేలా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగే పీజీఆర్ఎస్‌కు జిల్లా మంత్రి, ప్రజా ప్రతినిధులు హాజరయ్యేలా చూస్తున్నట్లు చెప్పారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై పటిష్టమైన ఆడిట్, శాఖాధికారులు బాధ్యతపై చర్చించినట్లు కలెక్టర్ తెలిపారు. రిడ్రెసల్‌లో ప్రజలతో మమేకమై బాగా పనిచేసిన అధికారులను గుర్తించి జ్ఞాపికతో ప్రతి సోమవారం సత్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలతో అధికారులు ప్రవర్తించే పద్ధతిపై అధికారులతో మాట్లాడి గ్రీవన్స్ నమోదు నుంచి రిడ్రెసల్ వరకు అధికారుల ప్రవర్తనలో మార్పు రావడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా నోడల్ అధికారులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అమలు చేయాలని, ప్రజల సమస్యల పరిష్కార దిశగా అంతా కృషి చేయాలని కోరినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

పిజిఆర్ఎస్ రిసెప్షన్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

బాబు పాలనలో భారాల బాదుడు

రెండు నెలల్లో రూ.15వేల కోట్ల భారం
27న విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా

ప్రజాశక్తి - సాలూరు

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై భారాల బాదుడుతో భవిష్యత్తుకు గ్యారంటీ లేదని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈరెండు నెలల్లోనే రాష్ట్ర ప్రజలపై రూ.15,450 కోట్ల విద్యుత్ ఛార్జీల భారం టిడిపి ప్రభుత్వం వేసిందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం హయాంలో విద్యుత్ ఛార్జీలు పెరిగాయని గగ్గోలు పెట్టి బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించిన సిఎం చంద్రబాబు నాయుడు ఇప్పుడు ప్రజలకు ఏం చెపుతారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తగ్గించుకుంటూ వెళ్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఆరు నెలల్లో చేసిందేమిటని నిలదీశారు. విద్యుత్ ఛార్జీలు పెంచడమే కాకుండా భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను వచ్చే నెల నుంచి పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇంకా వరద సెస్ కూడా వసూలు చేయాలని యోచిస్తోందని చెప్పారు .ఆరు నెలలకే ఇన్ని భారాలు వేస్తే రానున్న నాలుగున్నర ఏళ్ల లో ఇంకెన్ని భారాలు టిడిపి ప్రభుత్వం మోపుతుందో ప్రజలు ఆలోచించాలనీ కోరారు. ప్రజలపై వేస్తున్న భారాలకు నిరసనగా ఈనెల 27న విద్యుత్ ఎడిఇ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయిలో ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 27న నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీలు నిర్వహించి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేస్తున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు తెలిపారు. జియమ్మవలస మండలం చినమేరంగికోటలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. నిత్యవసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్‌ఛార్జీలు పెంచి మరింత ఆర్థిక భారం మోపిందన్నారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైతు సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - భామిని

రైతు బాగుంటేనే రాష్ట్రం, ప్రజలు బాగుంటారని నమ్మే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని ఎఎంసిలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం జెసి ఎస్ఎస్ శోభిక, ఎమ్మెల్యే జయకృష్ణ ప్రారంభించారు. రైతులు చిరకాల వాంఛ అయిన పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని, ఈ రోజు ధాన్యం రైతులకు అమ్మిన ధాన్యం డబ్బులు గంటల వ్యవధిలో అకౌంట్‌లో జమ కావడంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. రైతు అభివృద్ధికి సాగుకు అవసరమైన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, జంపరకోట జలాశయం, తోటపల్లి కుడి లిఫ్ట్ పనులు గత ప్రభుత్వంలో నిధులు నిలిపేసి నిర్లక్ష్యం చేశారని, కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో వీటిని పూర్తి చేస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రాధాన్యత క్రమంలో గిరిజన ప్రాంతాల్లో ఇన్ కనెక్టివిటీ రోడ్లు పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం జెసి శోభిక మాట్లాడుతూ కురుపాం, సీతంపేట, పాలకొండ, భామిని మండలాల నుంచి 16వేల మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు లక్ష్యంగా ఈ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ ఏడాది స్టోరేజ్ లేకుండా పత్తి కొనుగోలు చేసిన ట్రాన్స్ పోర్ట్ చేస్తారని, వచ్చే ఏడాది స్టోరేజ్ సౌకర్యం ఏర్పాటవుతుందని తెలిపారు. ప్రతి రైతు పత్తిని పత్తికొనుగోలు కేంద్రంలో అమ్మి మద్దతు ధర పొందాలని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రవినాయుడు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, భామిని సర్పంచ్ లోపింటి రాజేష్, టిడిపి నాయకులు బిడ్డికి ప్రసాద్, గురిబిల్లి లక్ష్మిపతి, కోరాడ రాజేష్, కొల్ల మధు, వ్యవసాయ అధికారి కె సింహాచలం, తహశీల్దార్ అప్పారావు, ఎఎంసి సెక్రటరీ వారణాసి సతీష్ కుమార్, జనసేన మండలం అధ్యక్షులు రుంకు కిరణ్, టిడిపి, జనసేన కార్యకర్తలు, పత్తి రైతులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, జెసి శోభిక

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పరిశీలన

మండలంలోని ఘనసర రైతుసేవా కేంద్రంలో చేపడుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను జెసి ఎస్ఎస్ సోభిక పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని ఈ కేంద్రాల ద్వారా ఎంత మొత్తం ధాన్యం కొనుగోలు చేశారన్న వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రంలో పలు రికార్డులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం ద్వారా రైతుకు అందుతున్న సేవలను అడిగారు. నేటికి మండలంలోని 8551 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వ్యవసాయధికారి కె.సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జ్యోతి, ఎలీసా, తహశీల్దార్ అప్పారావు, టిఎ కృష్ణారావు ఉన్నారు.

రక్త హీనత నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో రక్తహీనత సమూలంగా నివారణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఇందుకు రక్త హీనత నివారణ కమిటీలు పటిష్టంగా పనిచేయాలని అన్నారు. ఈ సైలెంట్ ఎపిడెమిక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొని రక్త హీనత నివారణ జిల్లాగా 2025 నాటికి ఆవిర్భవించాలని ఆకాక్షించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రక్తహీనత నివారణ కమిటీలు, రక్తదాన శిబిరాలు, పల్లె పండగ పనులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సోమవారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో ఎక్కువ మంది గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారని, దీన్ని నివారించేందుకు పటిష్టంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కమిటీలు ఉంటాయని చెప్పారు. ఎండిపిఒలు రక్తహీనత నివారణ కమిటీలకు మండల స్థాయిలో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎఎన్ఎన్, ఆశా, ఎంఎల్‌హెచ్‌పి, మహిళా పోలీసు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు సభ్యులుగా గ్రామ స్థాయిలో ఉంటారని ఆయన చెప్పారు. ఈ కమిటీ ప్రతి 15 రోజులకు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి నెలా 1,3 గురువారాలు ఈ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. గర్భిణులకు నిర్దిష్ట సమయంలో టేక్ హోమ్ రేషన్ (టి హెచ్ ఆర్) అందించాలని ఆయన ఆదేశించారు. వివిధ సంస్థల సహకారంతో పౌష్టిక ఆహారాన్ని అందించడం, పౌష్టిక ఆహార తోటలు (న్యూట్రి గార్డెన్) ప్రోత్సహించడం, డ్రై ఫ్రూట్స్ వంటి అంశాలపై దష్టి సారించింది అందించుటకు సహకరించాలని ఆయన సూచించారు. నిక్షయ మిత్ర కార్యక్రమంలో రూ.4200 చెల్లిస్తే ఆరు నెలలకు సరిపడా పౌష్టిక ఆహారాన్ని అందిస్తారని ఆయన చెప్పారు. వసతి గహాల్లో ఉన్న విద్యార్థులకు రక్త హీనత ఉండరాదని ఆయన స్పష్టం చేశారు.

త్వరితగతిన పల్లెపండగ పనులు పూర్తి

పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులు పూర్తి చేయడంలో జాప్యం చేస్తున్న పంచాయతీరాజ్ సహాయ ఇంజినీర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జనవరి 15 నాటికి జిల్లాలో మంజూరు అయిన 659 పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగు నీటి సమస్యలపై ప్రజలు క్షేత్ర స్థాయిలో అడుగుతున్నారని, వాటిని పరిష్కరించుటకు మండల, జిల్లా పరిషత్ నిధులు ఉపయోగించుకోవచ్చని అన్నారు. అవసరాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆయన చెప్పారు. ఏ గ్రామంలోనూ త్రాగు నీటి సమస్య ఉండరాదని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ కె.హేమలత, ఇపిడిసిఎల్ ఎస్ఇ కె చలపతిరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, డిపిఒ టి.కొండలరావు, డిఇఒ ఎన్‌టి నాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐసిడిఎస్ పీడీ ఎంఎన్ రాణితో పాటు పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ చైర్మన్‌గా పల్లా ప్రతాప్

ప్రజాశక్తి -పాలకొండ



స్థానిక నగర పంచాయతీ చైర్మన్‌గా పల్లా ప్రతాప్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ఇటీవలే నగరపంచాయితీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి వ్యక్తిగత కారణాలతో ఆ పదవి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న ప్రతాప్‌ను చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అయితే చైర్మన్ నియామకం విషయంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. వైసిపికే చెందిన ఒకటో వైస్ చైర్మన్ హనుమంతరావు, రెండో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్ ఆశించారు. అయితే ఈ విషయంలో ప్రతాప్ సోదరుడు టిడిపి కీలక నేత పల్లా కొండలరావు తన రాజకీయ చతురత ప్రదర్శించి తన సోదరుడైన ప్రతాప్‌కు ఆ పదవి దక్కడంలో కీలకపాత్ర పోషించారు. టిడిపిలో కీలకంగా ఉన్న కొండలరావుకు ప్రభుత్వంలో ఉన్న పలుకుబడితో పాటు ఎమ్మెల్యే జయకృష్ణతో ఉన్న సాన్నిహిత్యం కలిసివచ్చిందని చెప్పవచ్చు.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల కాలంలో వివిధ కారణాల వల్ల మరణించిన పోలీసు కుటుంబాలకు సోమవారం ఎస్పీ ఎస్‌వి మాధవ్‌రెడ్డి తన కార్యాలయంలో ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందించారు. రైలు ప్రమాదంలో మరణించిన టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ జి.మల్లేశ్వరరావు కుటుంబానికి శాఖాపరంగా మంజూరు చేసిన విడో ఫండ్ రూ.50వేలు చెక్కును, ఇన్సిడెంట్ల ఫండ్ రూ.25వేలు చెక్కును ఆయన భార్య జి.శ్రావణికి అందజేశారు. అలాగే అనారోగ్య సమస్యలతో మరణించిన ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ కె.బూధర్ కుటుంబానికి శాఖా పరంగా మంజూరు చేసిన అడిషినల్ కార్పస్ ఫండ్ లక్ష రూపాయల చెక్కును అతని కుమారుడైన నిఖిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాసరావు, కుటుంబానికి శాఖా పరంగా మంజూరు చేసిన అడిషినల్ కార్పస్ ఫండ్ లక్ష రూపాయల చెక్కును ఆయన భార్య రజినికుమారికి అందజేశారు.



ఖైదీలతో మాట్లాడుతున్న విజయనగరం జిల్లా జడ్జి సాయికల్యాణ చక్రవర్తి

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక సబ్ జైల్‌ను విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయికల్యాణ చక్రవర్తి సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సబ్ జైల్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రికార్డ్‌లను, ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి సబ్ జైల్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. వారికి అందించే ఆహారం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని ఖైదీలను కోరారు. న్యాయవాదిని నియమించుకోలేని వారికి న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఖైదీలలో సత్ ప్రవర్తనతోనే మార్పు సాధ్యమవుతుందని జడ్జి అన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం రెండో అదనపు జడ్జి ఎస్.దామోదరరావు, లోక్‌అదాలత్ సభ్యులు టి. జోగారావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వెంకటరావు, సబ్ జైల్ సూపరింటెండెంట్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుజ్జువాయి పంచాయతీ పరిధిలో గల డి.భారామణి గ్రామ గిరిజన ప్రజలు తమ గ్రామానికి బిటి రహదారి సౌకర్యం కల్పించాలని సోమవారం స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరికి గుమ్మలక్ష్మీపురంలో తన క్యాంపు కార్యాలయం వద్ద కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో వైద్య సేవలందడం లేదని, వర్షాలు పడినప్పుడు రహదారి బురద మయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. కావున బిటి రహదారి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు మంజూరుకు ప్రతిపాదనలు పంపించి నిర్మాణం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

ధాన్యం కొనుగోలులో అలసత్వం వద్దు : జెసి

ప్రజాశక్తి - సీతంపేట

రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎలో జిల్లాలోని రైస్ మిల్లర్లు, తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని అన్నారు. రైతుల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి బిల్లులు వెంటనే అప్లోడ్ చేయాలని సూచించారు. రైతులకు త్వరితగతిన డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్లకు సూచించారు. ధాన్యం కొనుగోలులో కొలతల్లో ఎటువంటి తేడా ఉండకూడదని అన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతుల నుంచి ఎటువంటి నగదు వసూలు చేయరాదని జెసి సూచించారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, సివిల్ సప్లయ్ డిఎం, తహశీల్దార్లు అప్పలరాజు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద అర్థనగ్న ప్రదర్శన చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు

డీలర్ల ఎంపికకు రాత పరీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీ పురం డివిజన్‌లో చౌకధరల దుకాణాల డీలర్ల ఎంపికకు రాత పరీక్ష సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పరీక్షలను పరిశీలించారు. డివిజన్లో 36 చౌకదారుల దుకాణ డీలర్ల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నోటిఫికేషన్ ఆధారంగా 285 దరఖాస్తులు అందాయి. వాటిలో 63 తిరస్కరణకు గురి కాగా, 222 అంగీకరించారు. రాత పరీక్షలకు 202 మంది హాజరు కాగా, 20 మంది గైర్హాజరు అయ్యారు.



పరీక్షలను పరిశీలిస్తున్న పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

ప్రశాంతంగా డీలర్ పోస్టు పరీక్షలు

పాలకొండ : డివిజన్ పరిధిలోని 20 డీలర్ పోస్టుల భర్తీకి ఈనెల 9న ఇచ్చిన నోటిఫికేషన్‌ను అనుసరించి ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలరు ఉద్యోగానికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నియామక పరీక్ష జరిగింది. సబ్ కలెక్టరు యస్వంత్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో ఈ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు డివిజన్ నుండి 64 మంది హాజరయ్యారు. పోలీస్ బందోబస్తు మధ్య జరిగిన ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి

కలెక్టరేట్ వద్ద అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి సమస్యలు పరిష్కారం చేయాలని గిరిజన గురుకుల అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మక దివాకర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ గిరిజన గురుకుల అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం భావ్యం కాదని ఆవేదన వ్యక్తంచేశారు. న్యాయమైన డిమాండ్ల కోసం శాంతియుత 34 రోజులుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అమలు చేయకపోవడం కూటమి ప్రభుత్వానికి మంచిది కాదని, ప్రభుత్వం దిగివచ్చి డిమాండ్లను నెరవేర్చాలని, లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే గిరిజన సంక్షేమ శాఖా మంత్రి ఇంటి ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్, రాజేష్, రమణ, కామేశ్, లక్ష్మణ్, మోహన్, తిరుపతి, ఉమా, అప్పారావు, జ్యోతి, హేమా,దీపా, లక్ష్మి, త్రివేణి, సింహాచలం, గిరిజన సంక్షేమం సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్, ఎఐవైఎస్ జిల్లా కార్యదర్శి బిటి నాయుడు, ప్రజా నాట్య మండలి నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు..

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేకును కట్ చేసి, కేండల్స్‌ను వెలిగిస్తూ జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సందేశాన్ని ఇచ్చారు.
-ప్రజాశక్తి - పార్వతీపురం

నిర్ణీత సమయంలోగా ఫిర్యాదుల పరిష్కారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డిసిఆర్‌బి ఎస్ఐ ఫక్రుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రతి గ్రామానికీ పక్కా రోడ్డు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. జియ్యమ్మవలస మండలం సింగనాపురం రోడ్డు నుండి గదబవలస వరకు రూ.1.20 లక్షలు నిధులతో, డంగభద్ర నుండి డంగభద్ర వలస వరకు రూ 1.30 లక్షలు నిధులతో మంజూరైన బిటి రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం : విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన అన్నదమ్ముల కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శిఖబడికి వెళ్లి సోమవారం పరామర్శించారు. జియ్యమ్మవలస మండలం శిఖబడికి వెళ్లి మృతి చెందిన వైకుంఠపు శ్రీను, సింహాచలం కుటుంబ సభ్యులకు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, నాయకులు డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, మూడడ్ల సత్యం నాయుడు, బొంగు సురేష్, జోగి భుజంగరావు, నందివాడ కృష్ణబాబు, గురాన శ్రీరామ్మూర్తి నాయుడు, దాసరి రామారావు తదితరులు ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ పద్మావతి

పాఠశాలను సందర్శించిన డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కెవిఎస్ పద్మావతి సోమవారం సందర్శించారు. ఇటీవల ప్రభుత్వం విద్యార్థులకు జారీ చేసిన "రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం కార్డుల వివరాలు, హెచ్‌బి లెవెల్స్ విద్యార్థులకు ఏవిధంగా ఉన్నాయన్న వివరాలు ఆరా తీశారు. రక్తహీనత గల బాలల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది డాక్టర్ ఉషారాణి, కె.సత్యవతి, ఎస్‌వి రమణ, జివిఎస్.శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఇన్చార్జ్ హెచ్‌ఎం ముప్పాల. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ లంక శ్రీనివాసరావు అన్నారు. సంకల్పంలో భాగంగా మండలంలోని మండలంలోని చిన,పెద్ద భోగిలి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైం, ఆన్లైన్ మోసాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పన్నులను వసూలు చేస్తున్న మున్సిపల్ రెవెన్యూ అధికారులు

రూ.3.87 లక్షల పన్నులు వసూలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ఎం.జయంతితో పాటు ముగ్గురికి పన్ను బకాయిదారుల నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.3 లక్షల 83 వేల 237 ఇంటి పన్నును మున్సిపల్ ఆర్ఐ బంటుపల్లి ఈశ్వర్‌తో పాటు 11, 12, 14వ వార్డు సచివాలయం అడ్మిన్ సెక్రటరీలు హరిప్రసాద్, కిరణ్, ఉపేంద్ర, తదితరులు పాల్గొని ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పన్ను వసూలు చేశారు.. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ పన్ను బకాయిదారులు చెల్లింపునకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మున్సిపల్ ఆదాయాన్ని పెంచి, పట్టణాభివృద్ధికి సహకరించాలని అన్నారు.

మారుమూల గిరిజన ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎస్ సొసైటీ సహకారంతో విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం మండలం నెల్లికిక్కువ పంచాయితీ వాడపుట్టి, దుడ్డుకల్లు పంచాయితీ కొత్తవలసలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 184 మందికి కంటి తనిఖీలు నిర్వహించగా ఇందులో 43 మందిని శస్త్ర చికిత్స నిమిత్తం విజయనగరం తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఉన్నారు.

డోర్ డెలివరీనీ సద్వినియోగం చేసుకోండి : ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఆర్‌టిసి సంస్థ చేపడుతున్న డోర్ డెలివరీని ప్రజలు, కార్గో వినియోగదారులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద సిబ్బందితో మాట్లాడుతూ ఈనెల 20 నుంచి జనవరి 19 వరకు ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా, ఆర్టీసీ ద్వారా బుక్ చేసుకున్న 50 కేజీల లోపు బరువున్న పార్సిల్స్, కొరియర్స్ రాష్ట్రంలో 80 ముఖ్య పట్టణాల్లోని కౌంటర్ల ద్వారా 10 కిలో మీటర్ల పరిధి వరకు ఇంటి వద్దకే డోర్ డెలివరీ చేసే సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

జాతీయ రైతు దినోత్సవాన్ని మండలంలోని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. ధ్రువ రైతులకు సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన శాస్త్రం కింద నువ్వులపై శిక్షణ ఇచ్చి నూనె గింజల ప్రాముఖ్యత అలాగే నువ్వుల్లో సమగ్ర సస్యరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం నువ్వులు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కెవికె సిబ్బంది డాక్టర్ శ్రీనివాసరాజు, డాక్టర్ అనంత విహారి, డాక్టర్ జి.అమృత వీణ, డాక్టర్ స్రవంతి రైతులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి పి.షణ్ముఖరాజు ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఎటువంటి రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా గత 8 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్దతులు చేస్తూ, తనకున్న భూమిని ఏడాది పొడవునా పలు పంటలు పండిస్తున్న వంజరాపుగూడకు చెందిన పల్ల శంకరమ్మను సన్మానించి, జ్ఞాపికను అందించారు. విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకత, జెండర్ ఆధారిత హింసపై అవగాహన ప్రతిజ్ఞ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం ప్రకృతి వ్యవసాయ మోడల్ మండల ఎంఎంటిఎల్ వై.గణేష్‌శరత్ చంద్ర, ఎంటిలు జి.నిర్మలాదేవి, ఎల్.నరసింహ, టి.రవి, పి.ప్రసాద్, మిన్నారావు, కె.భూషణ్ పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని పీపీ ఇతమనుగూడ పంచాయతీ ఇప్పగూడలో సోమవారం వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ బి.సంజీవరావు, ఏరియా కోఆర్డినేటర్ పారక శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలు, రసాయనిక, పురుగు మందులతో పండించే పంటలు తగ్గించాలని అన్నారు. ఆరోగ్యం, ఆర్థిక అభివృద్ధి సాధించాలని అన్నారు,

రైతులకు నువ్వు విత్తనాలు అందజేస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

పార్వతీపురంరూరల్: జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు బందలుప్పి, ఎం.ఆర్ నగరం గ్రామాల రైతులను సోమవారం దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత వరకు సేంద్రీయ ఎరువులతో పంటలు పండించడం వల్ల మానవాళి ఆరోగ్యానికి ఎంతో దోహదపడిన వారవుతారని అన్నారు. ఈ సందర్భంగా వారికి పలు ఆరోగ్య సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఇఒ సత్తిబాబు, సూపర్వైజర్ జయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంఝావతిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జంఝావతిని జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు కోరారు. మండలంలోని వెంకంపేటలో జంఝావతి కన్నీటియాత్ర కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆ సమితి రాష్ట్ర అధ్యక్షులు జాగారపు ఈశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య సింహ చక్రవర్తి, బిజెపి నాయకులు మరిశర్ల రామారావు, ప్రత్యేక సలహాదారు వర్రి శివకష్ణ, విజయనగరం జిల్లా అధ్యక్షులు ఐ.గోపాలరావు, విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు దేవుపల్లి సత్యారావు పట్నాయక్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు భారతానంద స్వామి, రాష్ట్ర కార్యదర్శులు సవరపు రామారావు, ఈర్ల సంజీవ నాయుడు, భాస్కర్ విద్యాసంస్థల యజమాని చుక్క భాస్కరరావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి సాంబమూర్తి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్, వినియోగదారుల సంఘం, జిల్లా కార్యదర్శి మాన్యం రామకష్ణ తదితరులు మాట్లాడారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో పొలాలు బీడువారి ఉత్తరాంధ్ర వెనుకబడుతోందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా జంఝావతిని సాధించేందుకు అన్ని పార్టీల వారు కలిసి రావాలన్నారు. త్వరలో అన్ని వర్గాలతో కలిపి జంఝావతి సాధన సమితి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి చినబొండపల్లి సర్పంచ్ గండి శంకరరావు, వెంకంపేట సర్పంచ్ తీళ్ల కృష్ణారావు తదితరులు జంఝావతి కన్నీటి యాత్రకు తమ మద్దతు తెలిపి దరఖాస్తులను అందజేశారు.

హైస్కూల్ హెచ్ ఎం సస్పెన్షన్

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణం లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ ఎం పివి ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించినందుకు హెచ్ ఎం పివి ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలలో పని చేస్తున్న పిఇటి గాంధీ కి సంబంధించిన మెడికల్ లీవ్ జీతం బిల్లు పెట్టాలని పదేపదే ఆదేశించినా హెచ్‌ఎం ప్రసాద్ అమలు చేయలేదు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేయాలని జిల్లా అధికారులు ఆర్‌జెడికి సిఫార్సు చేశారు. ఇలాంటి ఆరోపణలపైనే ఆయన గతంలో కూడా పలుమార్లు సస్పెండ్ అయినట్లు తెలుస్తోంది.

కొండచీపుర్లు కొనుగోలు చేయాలి

ఐటిడిఎ గ్రీవెన్స్‌లో గిరిజనుల వినతి

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనులు సేకరించిన ఆటవీ ఉత్పత్తుల్లో కొండచీపుర్లు జిసిసి కొనుగోలు చేయాలని, కొండచీపురులు మైదాన ప్రాంతంలోకి తీసుకెళ్లినప్పుడు అటవీ శాఖ అభ్యంతరం లేకుండా చూడాలని ఆదివాసీ జెఎసి నాయకులు బి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, బిడ్డిక అప్పారావు, చిరంజీవి, రామస్వామి, తదితరులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి సమర్పించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక ఆధ్వర్యంలో స్థానిక ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 108 వినతులు అర్జీదారులు సమర్పించారు. ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు, ఎఒ సునీల్, డిడి అన్నదొర, పిహెచ్ఒ వెంకట గణేష్, డిఇ సింహాచలం, డిఎల్‌డిఒ గోపాలకష్ణ, విద్యుత్ శాఖ డిఇ, సిడిపిఒ రంగలక్ష్మి, పిఆర్ డిఇ రాధారాణి ఉపాధిహామీ, వెలుగు ఎపిడిలు శ్రీహరి, సన్యాసిరావు, పిఎంఆర్‌సి సిబ్బంది, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలో నాయి బ్రాహ్మణుల కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బర్లి సుధ కోరారు. పాలకొండలో వివాహ శుభకార్యాలకు ఏ ఊరు నుంచి పాలకొండ వచ్చినా నాయి బ్రాహ్మణులకు రోడ్లపై పడుకోవాల్సి వస్తుందని, ఏ శుభకార్యాలకైనా వాయిద్యం, మృదంగం బ్యాండ్ పార్టీ శుభకార్యాలకు రాత్రిపూట ఇంటికి చేరాలంటే ఇబ్బందులు వస్తున్నాయని కావున కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని పాలకొండ అభివృద్ధి కమిటీ చైర్మన్ పల్లా కొండలరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాలకొండ టిడిపి పట్టణ అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్ ఉన్నారు.

కిమ్మి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడుకూరు గ్రామ సిఎస్‌పి రహదారి నుంచి కిమ్మి గ్రామ వంతెన వరకు రహదారి విస్తరణ అభివద్ధి పనులు చేపట్టాలని, రుషింగి, కొప్పరవలస, కిమ్మి, బల్జిపేట, నారాయణపురం తదితర గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. సింగిల్ రహదారి కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని వారు తెలిపారు. వంతెన పనులు పూర్తి కావడంతో ఈ ప్రాంతమంతా ప్రతిరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగించడంతో ఉన్న రహదారి ఇరుగ్గా ఉన్నందున వాహనదారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. రహదారికి ఇరువైపులా పంటపొలాలు ఉండడం వల్ల ఏ మాత్రం అదుపు తప్పినా వాహనాలు పంట పొలాలకు దూసుకెళ్లే ప్రమాదం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు పాలకుల, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

ప్రజాశక్తి - కురుపాం

గిరిశిఖర గ్రామాల పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా నేటివ్ ఇకో ఆర్గానిక్ రూట్స్ సంస్థ గిరిజన గ్రామాల్లో పనిచేస్తుందని సిఇఒ వినోద్ కుమార్ అన్నారు. మండలంలోని గొటివాడలో గిరిజన రైతులు పండించిన పత్తిని సోమవారం కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో గల కురుపాం, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా కూడా కొనుగోలు చేస్తున్నామని అన్నారు

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - మక్కువ

ప్రజలు ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక చర్చి సెంటర్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. అనంతరం వాహన చోదకులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. దురదృష్టవశాత్తు ప్రమాదాలు చోటు చేసుకుంటే హెల్మెట్ ధరించడం వల్ల అపాయం నుండి బయటపడొచ్చని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహన చోదకులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌పై చర్య తీసుకోవాలని ట్రైబల్ రైట్స్ ఫోరం, ఆదివాసీ జెఎసి, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలో గిరిజన యువతీ యువకులు తీసుకున్న వ్యాపార రుణాలకు సంబంధించి రాయితీలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. గిరిజన నిరుద్యోగులకు ప్రభుత్వం అందించే పిఎంఇజిపి, ఇతర రుణాల ద్వారా చిన్నచిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు సంబంధించి ప్రభుత్వం అందించి రాయితీలు, సబ్సిడీ, బ్యాంకు లింకేజీ చేయకుండా చాలా ఇబ్బంది పెడుతున్నారన్నారు. దీనివల్ల వీరు అధిక వడ్డీ కట్టుకోవలసి వస్తుందని చెప్పారు. అంతేకాకుండా వ్యాపార పరంగా కూడా చాలా ఇబ్బంది జరుగుతుందని, కావున దీనిపై సమగ్ర విచారణ జరిపి గిరిజన యువత న్యాయం చేయాలని కోరారు.

చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

క్రిస్మస్ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తన క్యాంపు కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో గల అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. క్రిస్మస్ కేక్ కట్ చేసిన ఎమ్మెల్యేకు టిడిపి శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే దంపతులు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలంతా సుఖశాంతులతో వెలగాలని క్రిస్మస్ సందర్భంగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలో రైతుల నుంచి ప్రభుత్వం ఇప్పటి వరకూ 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని మండల వ్యవసాయశాఖ అధికారిని రేగిడి విజయభారతి తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన సకాలంలో మిల్లులకు తరలిస్తుందని పేర్కొన్నారు. అలాగే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోగా రైతుల ఖాతాలకు డబ్బులు జమ అవుతున్నాయని ఎఒ పేర్కొన్నారు. మండలంలోని 13 రైతుసేవా కేంద్రాల పరిధిలో 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా ఇంతవరకు 20 వేలమెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు.

మండలాన్ని వదలని ఏనుగులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని సుంకిలో మూడు రోజులు తిష్ట వేసిన ఏనుగులు గుంపు ఆదివారం మధ్యాహ్నం మరుపెంట వైపు వెళ్లి మళ్లీ సుంకి వచ్చిన రైతుల వరి కుప్పలను ధ్వంసం చేశాయి. ఆదివారం రాత్రి సుంకి సమీపంలోకి మళ్లీ ఏనుగులు గుంపు ప్రవేశించి వరి కుప్పలను ధ్వంసం చేశాయని రైతులు ద్వారపురెడ్డి శ్రీనువాసరావు, పెనుగంటి నారంనాయుడు, పెనుగంటి గౌరునాయుడు తెలిపారు. నూర్పులు చేపట్టేందుకు కళ్లంలో కుప్పలుగా వేసిన వరి పంటను ఏనుగులు ధ్వంసం చేయడంతో తీవ్ర నష్టాలకు గురయ్యామని రైతులు పేర్కొన్నారు. కొమరాడ, జియ్యమ్మవలస మండలాల నుంచి తరలివచ్చిన ఏనుగులు ప్రస్తుతం తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో ఏనుగులు సంచరిస్తున్నాయి. చేతికందుతుందన్న సమయంలో ఏనుగులు పంటలను పూర్తిగా ధ్వంసం చేయడంతో తీవ్ర నష్టాలకు గురయ్యామని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రైతులు పొలాలకు వెళ్లేందుకు భయాందో ళనలు వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆశ్రమ పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కోసింగిభద్ర ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు, నాయకులు బి.అనిల్ సందర్శించారు. పాఠశాలలో 84 మంది విద్యార్థులు చదువుతున్నారని, పాఠశాల చుట్టుపక్కల ప్రహరీగోడ లేకపోవడం వల్ల రాత్రిపూటల్లో విష సర్పాలు వస్తున్నాయని పిల్లలకు ఏదైనా జరగరానిది జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ఎఎన్ఎం లేరని, జ్వరం వస్తే దగ్గర్లో హాస్పిటల్ లేదని తెలిపారు. తాడికొండ హాస్పిటల్ తప్ప వేరే దిక్కు లేదన్నారు. తక్షణమే ఎఎన్ఎంను నియమించాలని, అదే విధంగా వర్కర్స్‌ను కూడా నియమించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎన్‌వై నాయుడు

26న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందాలు అమలు కోసం పోరాటంలో భాగంగా గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన 16 రోజుల సమ్మె ఒప్పందాలను అమలు చేయడంలో అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 26న అన్ని పట్టణాల్లో ధర్నాలు నిర్వహిస్తున్నామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో మన్యం జిల్లా మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు చీపురుపల్లి సింహాచలం, బంగారు రవి, మామిడి శివతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 16 రోజులు సమ్మె జరిగి డిసెంబర్ 26 నాటికి ఏడాది పూర్తవుతుందని, నేటికీ రిటైర్ అవుతున్న వారికి ఇవ్వాల్సిన నష్టపరహారం, ప్రమాదవశాత్తు మరణిస్తున్న వారికి రావాల్సిన నష్ట పరిహారం, దహన సంస్కారానికి పెంచిన మొత్తం మంజూరుకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం జీవోలు విడుదల చేయలేదన్నారు. పాలకొండ, పార్వతీపురం, సాలూరు పట్టణాలు ఈ పదేళ్లలో విస్తరించాయని, ఈ విస్తరణకు సరిపడా అదనంగా కార్మికుల్ని నేటికీ వేసుకోలేదని, దీనివల్ల ఉన్న కార్మికులపైనే పనిభారం పడుతుందని అన్నారు. మున్సిపాలిటీలో రెగ్యులర్‌గా చీపుర్లు, బుట్టలు, కాంట్రాక్ట్ కార్మికులకు యూనిఫారం, సబ్బులు, నూనెలు ఇవ్వడం లేదని, దీనివల్ల చాలామంది కార్మికులు అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం గత సమ్మె కాలాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే పై సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 26న ధర్నా, జనవరి 10న సమ్మె ముగింపు రోజైన ఆరోజున దీక్షలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం అప్పటికీ సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరిలో కలెక్టరేట్ వద్ద ఆందోళనకు వెనుకాడబోమని, ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు పెంచి జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు కోశాధికారి జివి రమణ, మున్సిపల్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి రమణారావు పాల్గొన్నారు.

13 గ్రామాల్లో పీసా ఎన్నికలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని 13 గ్రామాల్లో పీసా ఎన్నికలకు గానూ, 9 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా, మిగిలిన కిల్లాడ, జయపురం, వజ్జాయిగూడ, కొత్తగూడ గ్రామాల్లో ఎన్నికలు జరిగినట్లు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించినట్లు పిఒ తెలిపారు.

గ్రంథాలయంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పిస్తాం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

బెలగాంలోని గల పట్టణ విజ్ఞాన వికాస్ కేంద్రం (గ్రంథాలయం) లో సౌకర్యాలు కల్పిస్తామని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. సోమవారం బెలగాం చర్చి వీధిలో గల పట్టణ విజ్ఞాన వికాస్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గ్రంథాలయంలో పాఠకులతో పాటు పోటీ పరీక్షల కోసం చదువుకుంటున్న అభ్యర్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, చదువుకునేందుకు విచ్చేసే విద్యార్థులకు కనీస అవసరాలు ఉండాలని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రంథాలయానికి టేబుళ్లు, అట్టలు, కుర్చీలు వంటి ఫర్నీచర్ అవసరమని కోరగా, వాటిని మంజూరు చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

అన్నదాత కష్టం పరదాలకే పరిమితం

ప్రజాశక్తి - వీరఘట్టం

ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని కుటుంబ సమేతంగా ఆరుగాలం పండించిన పంట పరదాలకు పరిమితమైంది అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మండలంలో కురిసిన వర్షాలకు ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు ముందుకు రాకపోవడంతో వీటిని భద్రపర్చుకునేందుకు స్థలం లేక కళ్లాల్లోనే పంటను పరదాల కింద దాచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది పంట దిగుబడి బాగా ఉన్నప్పటికీ పంటపై పెట్టిన పెట్టుబడులు పోనూ వచ్చిన లాభంతో కుటుంబాన్ని పోషించుకోవచ్చన్న ఆశ ఆవిరి అయిపోయింది. ఈనెల 22న ఎండ అధికంగా ఉండడంతో పరదాల కింద ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టినప్పటికీ సోమవారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో తమ ఆశలకు గండి పడినట్టయ్యిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు తడిసిన పనలను పొలాల్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్లు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఒ డి.వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని హుస్సేన్ పురం సచివాలయ పరిధిలో గల కొంచ గ్రామానికి చెందిన కొంతమంది వికలాంగులు కాకుండానే పింఛన్లు పొందుతున్నారని, అనర్హుల పింఛన్లు తొలగించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 డి.గౌరు నాయుడు, హౌసింగ్ ఎఇ వి.వినోద్ కుమార్, ఎ జి.సత్యం నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా, పార్వతీపురం మన్యం జిల్లా
టెండర్ ప్రకటన
రేఖా సంఖ్య: 434/ఎ1/kgbv/ఎస్.ఎస్/మన్యం/2024 తేది: 12.2024
జిల్లా పథక కార్యాలయము, సమగ్ర శిక్షా, పార్వతీపురం మన్యం జిల్లా

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పార్వతీపురం మన్యం జిల్లా లో గల 14 కస్తూరిభా గాంధీ బాలిక విద్యాలయాలకు మరియు 07 Type-IV KGBV బాలికల వసతి గృహములకు కాయగూరలు, ఆకు కూరలు, పండ్లు, చికెన్, గుడ్లు, మరియు పాలు సరఫరా చేయుటకు అనుభవము మరియు అర్హత కలిగిన వారి నుండి ఓపెన్ టెండర్ కొరకు దరఖాస్తు తేది. 24.12.2024 నుండి 27.12.2024 మధ్యాహ్నం 5.00 గంటల వరకు కార్యాలయం పని దినములలో పని వేళల్లో స్వీకరించబడును. ఇతర వివరములకు అదనపు పథక సమన్వయ కర్త, సమగ్ర శిక్షా, పార్వతీపురం మన్యం వారి కార్యాలయములో సంప్రదించగలరు.

వరుస సంఖ్య.	అంశము	కూరగాయలు, పండ్లు, చికెన్	పాలు, గుడ్లు
1.	టెండర్ దరఖాస్తు ధర	రూ. 2000 /-	రూ. 2000 /-
2.	టెండర్ ధరావత్తు	రూ. 1,00,000 /-	రూ.2,00,000 /-

* టెండర్ డి.డి.: APC మరియు FAO, సమగ్ర శిక్షా, పార్వతీపురం మన్యం వారి పేరున చెల్లుబడి అగునట్లు తియవలెను.
* టెండర్ తెరచు తేది: తేది: 28.12.2024, ఉదయం 11.00. గంటలకు
* టెండర్ తెరచు వేదిక : జాయింట్ కలక్టరు వారి ఛాంబర్, కలక్టరేట్ కాంపౌండ్ పార్వతీపురం మన్యం.

జిల్లా విద్యా శాఖాధికారి & ఎక్స్ -అఫీషియో,
డి.పి.సి., & ఎ.పి.సి., సమగ్ర శిక్షా,